జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



గురువారం | 17-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 785 పేజీలు: 4 వెల : రూ.7


## త్వరలో శ్రీకాకుళంలో..

# రోబోటిక్ ఆర్థో సర్జరీ



* జెమ్స్‌లో రూ.6కోట్లతో రోబోటిక్ సర్జరీ సదుపాయం
* విశాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అధునాతన వైద్యం
* డాక్టర్ మహంతి సురేష్ ఆధ్వర్యంలో ఆర్థో విభాగంలో కీలక సేవలు





శ్రీకాకుళం, సెప్టెంబర్ 16 (వార్త): అధునాతన వైద్య సేవలు ఇక జిల్లా కేంద్రానికే చేరువ కానున్నాయి. ఇప్పటివరకు రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీల కోసం విశాఖపట్నం తదితర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండగా.. శ్రీకాకుళంలోని జెమ్స్ ఆసుపత్రిలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో రోబోటిక్ సర్జరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీంతో ముఖ్యంగా మోకాలు, కీళ్లకు సంబంధించిన క్లిష్టమైన శస్త్రచికిత్సలకు జిల్లా ప్రజలకు మరింత చేరువలో అధునాతన సాంకేతిక వైద్యం అందుబాటులోకి రానుంది.

### ఐదేళ్ల ప్రస్థానంలో 5 వేలకుపైగా శస్త్రచికిత్సలు

జెమ్స్ ఆసుపత్రిలో 2021 నుంచి ఆర్థోపెడిక్ విభాగంలో డాక్టర్ మహంతి సురేష్ సేవలు అందిస్తున్నారు. జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో ఆర్థోపెడిక్ ఫెలోషిప్‌తో పాటు ప్రత్యేక శిక్షణ పొందారు. ఇప్పటివరకు సుమారు 5 వేలకుపైగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. వీటిలో క్లిష్టమైన, అధిక ప్రమాదం ఉన్న 200కుపైగా కేసులకు విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించారు.

### మోకాలి కీళ్ల శస్త్రచికిత్సల్లో ప్రత్యేక దృష్టి..

మోకాలి కీళ్ల సమస్యలతో బాధపడుతున్న రోగులకు అధునాతన చికిత్స అందించడంపై ఆర్థో విభాగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గతంలో ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం స్థానికంగానే నిపుణుల వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

### హైదరాబాద్‌లో ప్రత్యేక శిక్షణ.. శ్రీకాకుళంలో సేవలు..

డాక్టర్ మహంతి సురేష్ హైదరాబాద్‌లో ఆర్థోపెడిక్ రంగంలో ప్రత్యేక విద్య, శిక్షణ పొందిన అనంతరం శ్రీకాకుళంలో సేవలు ప్రారంభించారు. జాయింట్ రీప్లేస్‌మెంట్‌తో పాటు ఆర్థోపెడిక్ విభాగంలోని ఆధునిక చికిత్సా విధానాలపై శిక్షణ పొందిన ఆయన.. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండేలా సేవలు కొనసాగిస్తున్నారు. తాజాగా మరో ఏడాది పాటు ప్రత్యేక శిక్షణ పొందారు.

### రోబోటిక్ సర్జరీతో మరింత ఖచ్చితత్వం..

మోకాలి, కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో రోబోటిక్ సాంకేతికత వినియోగం మరింత కచ్చితత్వంతో చికిత్స అందించేందుకు ఉపయోగపడుతుంది. ఈ సదుపాయం అందుబాటులోకి వస్తే శ్రీకాకుళం, పరిసర ప్రాంతాల ప్రజలకు అధునాతన ఆర్థోపెడిక్ చికిత్స స్థానికంగానే లభించే అవకాశం ఉంటుంది.

### ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ ద్వారా సేవలు..

విశాఖపట్నం వంటి నగరాల్లో ప్రైవేటు వైద్యసేవలకు భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో.. జిల్లాలోనే రోబోటిక్ సర్జరీ సదుపాయం అందుబాటులోకి రావడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగకరంగా ఉంటుందని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అర్హత ఉన్న రోగులకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పథకాల ద్వారా చికిత్స అందించే ఏర్పాట్లు ఉన్నాయని తెలిపాయి. విశాఖలో సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చయ్యే కొన్ని ఆపరేషన్లు కూడా అర్హత మేరకు ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ పరిధిలో ఇక్కడ చేయనున్నట్లు పేర్కొన్నాయి.

### జిల్లాలోనే అధునాతన వైద్యం..

ఇప్పటివరకు రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జరీల కోసం విశాఖపట్నం వెళ్లాల్సిన రోగులు.. ఇకపై జిల్లాలోనే ఈ సదుపాయం పొందే అవకాశం ఏర్పడనుంది. రవాణా, వసతి తదితర అదనపు ఇబ్బందులు తగ్గడంతో పాటు, రోగుల కుటుంబాలపై ఆర్థిక భారం కూడా కొంతమేర తగ్గే అవకాశం ఉందని వైద్యవర్గాలు భావిస్తున్నాయి. జెమ్స్‌లో రోబోటిక్ సర్జరీ సదుపాయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తర్వాత మోకాలు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న జిల్లావాసులకు అధునాతన ఆర్థోపెడిక్ వైద్యం మరింత చేరువ కానుంది.



## ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

# దినేష్

* మున్సిపల్ చైర్మన్‌గా పోటీకి ఆసక్తి
* తెలుగుదేశం సీటుపై ఆశలు
* వ్యాపార, సేవా కార్యక్రమాల్లో మంచిపేరు
* రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించేందుకు అడుగులు

ఇచ్ఛాపురం, సెప్టెంబర్16 (వార్త): ప్రముఖ వ్యాపార వేత్త రుత్విక గోల్డ్ యజమాని శ్రీనివాస్ జువెలరీ యజమాని పైడిశెట్టి దినేష్ కుమార్ తనకు రాజకీయాలు పట్ల ఆసక్తి ఉన్నట్లు ఇచ్ఛాపురం మున్సిపల్ ఛైర్మన్ సీటు ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఆయన మీడియా సమావేశంలో తన అభిప్రాయం వ్యక్తం చేశారు. తన తండ్రి దివంగత పైడిశెట్టి రవికుమార్ ఆశయాలకు అనుగుణంగా రాజకీయ రంగంలోకి అడుగు పెడుతున్నట్లు తెలిపారు. 41 ఏళ్ల దినేష్ కంప్యూటర్ సైన్సులో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తల్లి పూర్ణిమ, భార్య స్నిగ్ధా వ్యాపార లావాదేవీలలో సహకరిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు రుత్విక, కీర్తికాలు ఉన్నారు. సమాజ సేవ పట్ల అంకితభావంతో పి.దినేష్ కుమార్ గత కొన్ని దశాబ్దాలుగా ప్రజా సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ఇచాపురం పట్టణం మరియు పరిసర ప్రాంతాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన దినేష్ రోటరీ క్లబ్ ఆఫ్ ఇచ్ఛాపురం అధ్యక్షుడిగా, కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ, క్లబ్ అభివృద్ధితో పాటు అనేక సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించి, జిల్లా స్థాయిలో రోటరీ సేవా కార్యక్రమాల విస్తరణకు, వివిధ ప్రాజెక్టుల అమలుకు విశేషంగా కృషి చేశారు. ఆయన నాయకత్వం, చొరవతో ఇచ్ఛాపురం ప్రాంతంలోని అవసరమైన, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు కుట్టు మిషన్లు మంజూరు చేయించి, పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమం ద్వారా పలువురు మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు, తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పడేందుకు అవకాశం కల్పించారు. రోటరీ క్లబ్ ద్వారా ప్రజల కోసం అంతిమయాత్ర వాహనం (అంతిమయాత్ర వాన్)ను విరాళంగా అందించి, అవసరమైన కుటుంబాలకు విలువైన సేవను అందిస్తున్నారు. ధర్మపురం బాయ్స్ హైస్కూల్‌లో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఇచ్ఛాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, ప్రయాణికులకు ఉపయోగకరమైన సేవను అందించారు. మోడల్ స్కూల్‌లో ప్రధాన తాగునీటి ప్రాజెక్టును చేపట్టి, విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాల కోసం కృషి చేశారు. 2019లో ఇచ్ఛాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 12 అడుగుల ఎత్తు కలిగిన మొక్కలను పెద్ద ఎత్తున నాటించి, పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు. పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేశారు. ఈ ప్రాంతంలోని దేవాలయాల అభివృద్ధి మౌలిక సదుపాయాల కోసం ఆర్థిక సహాయం అందిస్తూ, ఆధ్యాత్మిక,సాంస్కృతిక ప్రదేశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. యువతను ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ ద్వారా అనేక కార్యక్రమాలకు మద్దతు అందిస్తూ, యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా జిల్లా స్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తూ, సేవ పట్ల తన అంకితభావాన్ని చాటుకుంటున్నారు. అలాగే జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ లో సభ్యుడిగా కొనసాగుతూ, సంస్థ చేపట్టే ముఖ్యమైన ప్రాజెక్టులు, కార్యక్రమాలకు విరాళాలు, సహకారం అందిస్తున్నారు. యువత అభివృద్ధి, సమాజ సేవా కార్యక్రమాలకు తన వంతు తోడ్పాటును అందిస్తున్నారు. సేవే లక్ష్యం... సమాజ అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, స్వచ్ఛమైన తాగునీటి అందుబాటు, పర్యావరణ పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి, నిరుపేదలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన, యువత ప్రోత్సాహం మరియు సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో పి. దినేష్ కుమార్ అందిస్తున్న నిరంతర సేవలు అందిస్తున్నారు. నాయకత్వ బాధ్యతలను సేవకు ఒక సాధనంగా మలుచుకుని, ప్రజల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న పి. దినేష్ కుమార్ సేవా ప్రస్థానం సమాజానికి ఆదర్శప్రాయమైనది. ఆయన రాజకీయరంగంలోకి ఆరంగ్రేటం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.

## మలేషియాలో చిక్కుకున్న ఆ నలుగురిని...

# క్షేమంగా తీసుకువస్తాం

* మలేషియా ఎంబసీతో నిరంతర సంప్రదింపులు
* విదేశాల్లో ఉద్యోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
* వీసా నిబంధనలు తెలుసుకోకుండా విదేశాలకు వెళ్లొద్దు
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, సెప్టెంబర్ 16 (వార్త): ఉపాధి కోసం మలేషియాకు వెళ్లి అక్కడి పోలీసుల అదుపులోకి వెళ్లి కోర్టు విచారణను ఎదుర్కొంటున్న శ్రీకాకుళం జిల్లా యువకులను స్వస్థలాలకు సురక్షితంగా తీసుకురావడానికి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్ని చర్యలు చేపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు, సోంపేట మండలాలకు చెందిన నలుగురు యువకులు, చొక్కరు సాయి కుమార్, లండ తరుణ్ కుమార్, చీకటి సాయి వంశీ తో పాటు గిరి లు... ఉపాధి కోసం టూరిస్ట్ వీసాపై మలేషియాకు వెళ్లారు. అయితే అక్కడ ఉద్యోగం చేస్తున్న సమయంలో కొద్ది రోజుల క్రితం మలేషియా పోలీసులు వారిని రైలులో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. టూరిస్ట్ వీసాపై మలేషియాలో ఉద్యోగం ఎలా చేస్తారంటూ ప్రశ్నించిన పోలీసులు, అనంతరం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దృష్టికి చేరడంతో, బాధిత యువకుల కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ ద్వారా మలేషియాలోని భారత ఎంబసీతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ, నలుగురు యువకుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నారు. ఈనెల 17వ తేదీన జరగనున్న కోర్టు విచారణ అనంతరం యువకులను స్వస్థలాలకు తీసుకురావడానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వీరికి ఏజెంట్‌గా వ్యవహరించిన భీమవరం ప్రాంతానికి చెందిన వ్యక్తిని ఈ వ్యవహారంలో సమన్వయం చేసుకుంటూ.. త్వరితగతిన బాధితులు స్వస్థలాలకు చేరేలా ప్రయత్నాలు చేస్తున్నారు. తమను స్వస్థలాలకు తీసుకురావడానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేస్తున్న ప్రయత్నాలపై బాధిత యువకులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. తమకు అండగా నిలిచి, మలేషియా అధికారులతో సమన్వయం చేస్తూ సహాయం అందిస్తున్న రామ్మోహన్ నాయుడుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచించారు. ముఖ్యంగా టూరిస్ట్ వీసాతో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పే వ్యక్తులను నమ్మవద్దని, వీసా నిబంధనలను పూర్తిగా తెలుసుకున్న తర్వాతే విదేశాలకు వెళ్లాలని కోరారు. అధిక జీతాలు, తక్కువ సమయంలో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరిగే మోసాలకు గురికావద్దని, సంబంధిత వీసా, ఉద్యోగ అనుమతులు, సంస్థ వివరాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ప్రయాణం చేయాలని హితవు పలికారు. విదేశాల్లో ఉపాధి అవకాశాల పేరుతో మోసపోకుండా యువత, వారి కుటుంబ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. మలేషియాలో చిక్కుకున్న సిక్కోలు వాసుల క్షేమ సమాచారం కోసం 6012-602 0360 నంబర్ కు సంప్రదించవచ్చని.. త్వరలోనే వారిని స్వస్థలాలకు చేరుస్తామని హామీ ఇచ్చారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# మెళియాపుట్టిలో కోతుల బీభత్సం

-భయాందోళన చెందుతున్న ప్రజానీకం

-గాయాల పాలవుతున్న ప్రజలు

- అధికారుల తీరుపై స్థానికుల అసంతృప్తి



**మెళియాపుట్టి, సెప్టెంబరు 16 (వార్త):** మెళియాపుట్టిలో లో గడిచిన మూడు దినాలుగా రెండు కోతులు వీధులలో సంచరిస్తూ చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలపై దాడులు చేస్తుండడంతో స్థానిక ప్రజానీకం తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల దాడులలో ఇప్పటివరకు సుమారు పదుల సంఖ్యలో ప్రజలు, మహిళలు, పిల్లలు తదితరులు గాయపడినట్లు స్థానికులు తెలియజేస్తున్నారు. గాయపడిన వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, ఇంకొంతమందికి మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలియజేస్తున్నారు. కోతుల దాడులు పెరుగుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే అటవీ శాఖధికారులకు సమాచారం అందించడంతో అటవీశాఖ సిబ్బంది మెళియాపుట్టికి చేరుకుని కోతుల కదలికలను పరిశీలిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది వస్తున్నప్పటికీ కోతులు దాడులను నిరోధించడంలో విఫలమవుతున్నారని వీరి దగ్గర కోతులను పట్టుకునేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం వాటి కదలికలను మాత్రమే ట్రాక్ చేస్తున్నట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపినట్లు స్థానికులు చెబుతున్నారు. రోజు రోజుకు కోతుల దాడుల వల్ల ప్రజలు గాయాలపాలై భయాందోళన చెంది ఇబ్బందులకు గురవుతున్నరని సమస్య తీవ్రతను అధికారులకు తెలియజేసినప్పటికీ అటవీ శాఖ సిబ్బంది పగటి సమయంలో తగిన చర్యలు చేపట్టకుండా సాయంత్రం వేళల్లో వచ్చి పరిశీలించి వెళ్లిపోతున్నారని స్థానికులు నిస్సహాహిత వ్యక్తం చేస్తున్నారు. కోతుల దాడులలో వై.నిఖిల్, బి.ఆనందరావు, ఈ. అప్పల సూరమ్మ, జి. రత్నం, పి. కుమారస్వామి, జి. ఆనందమ్మ, కె. జయలక్ష్మి, హేమ తదితరులతోపాటు రోజు రోజుకి దాడి చేస్తున్న సంఖ్య పెరుగుతూనే ఉందని కోతుల దాడులతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతునే ఇంకా ఎంత మందికి కోతులు దాడులు చేస్తే వాటిని పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టే నివారణ చర్యలు ఎప్పుడు చేపడతారని ప్రజలు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని తిరుగుతున్నప్పటికీ కంటి తుడుపు చర్యలే చేపడుతుందనట్లు స్థానికంగా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి కోతులు దాడుల నుండి మమ్మల్ని రక్షించి పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులతోపాటు మండల ప్రజానీకం కోరుతున్నారు.

## ఓజోన్ పొరను కాపాడుకోవాలి




**పాతపట్నం, సెప్టెంబరు 16(వార్త):** భూమి మీద జీవకోటి మనుగడకు ఓజోన్ పొర ఒక కవచం వంటిదని, అది రంధ్రమైనట్లైతే ప్రాణి మనుగడకే కష్ట సాధ్యమని, దానిని కాపాడుకోవలసినది మనందరి బాధ్యత అని స్థానిక పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల వైకుంఠ రావు అన్నారు. క్లోరోఫ్లోరో కార్బన్ ఉద్గారాల వల్ల భూమికి దుప్పటిగా కప్పిన ఓజోన్ పొర కొన్నిచోట్ల పలుచబడుటయు, కొన్నిచోట్ల రంధ్రమవుతూ ఉందన్నారు. పట్టణీకరణ, ఏసీలు వాడకం, ఫ్రిడ్జు విరివిగా వాడినందువల్ల ఓజోన్ పొర నాశనం అవుతుందని చింతించారు. శిలాజ ఇంధనాలు పొదుపుగా వాడాలని కోరారు. ఓజోన్ పొర నాశనమైతే చర్మకాన్సర్, చర్మవ్యాధులు, శారీరక రుగ్మతలు కలిగి జీవ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని అన్నారు. మానవ మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవలసినదేనని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించుటకు గొడుగులతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్టీ రామారావు, తిరుపతిరావు, రామారావు, రోజా, రంజిత మహాపాత్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతయ్య ఫౌండేషన్‌కి గిరిబాబు విరాళం




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16 (వార్త):** ప్రముఖ సామాజికకర్త పాతిర్ల గిరి బాబు రెడ్డి సీతయ్య ఫౌండేషన్, మండపల్లి, సోంపేట కి 25 కిలోల చొప్పున 4 బస్తాల బియ్యం (100 కిలోలు) విరాళంగా అందజేశారు. అన్న దానం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమాన్ని జిఎస్ సేవా ఫౌండేషన్, ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనపన శ్రీరామ్, కొర్రాయి రమేష్, బుగత శ్రీను పాల్గొన్నారు. సమాజ సేవలో భాగంగా అవసరమైన వారికి సహాయం అందించడం ఎంతో అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సీతయ్య ఫౌండేషన్ అధినేతలు గుల్ల రమేష్, గుల్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పశు నష్టపరిహారానికి 'బీమా' ధీమా



**పాతపట్నం, సెప్టెంబరు 16 (వార్త):** అనుకోని పరిస్థితుల్లో పశువులు, జీవాలు మరణిస్తే పశుపోషకులు తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని, ఆ నష్టాన్ని తగ్గించుకోవడానికి 'పశు భీమా పథకం' ఎంతగానో తోడ్పడుతుందని కొరసవాడ పశుచికిత్సాలయం వైద్యాధికారి డాక్టర్ అనిల్ తెలిపారు. రైతులు, పశుపోషకులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భీమా ప్రీమియం మొత్తంలో 85 శాతం వాటాను ప్రభుత్వమే భరిస్తుందని, పశుపోషకుడు కేవలం 27 రూపాయలు చెల్లిస్తే ఒక గొర్రెకు లేదా మేకకు ఒక సంవత్సరం పాటు బీమా వర్తిస్తుందన్నారు. బీమా చేసిన జీవాలు అనుకోకుండా మరణిస్తే ఒక్కో జీవికి 6 వేలు చొప్పున పరిహారం లభిస్తుందని, పశు పోషకులు వెంటనే తమ పరిధిలోని పశువైద్య కేంద్రాన్ని సంప్రదించి, తమ జీవాలకు భీమా చేయించుకోవాలని డాక్టర్ అనిల్ సూచించారు.

## ప్రైవేట్ స్కూళ్ల బలోపేతానికి చర్యలు

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఇచ్ఛాపురం నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు చాట్ల తులసీదాస్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. రాష్ట్ర జిల్లా నాయకులు హాజరైన ఈ సమావేశంలో తులసీదాస్ రెడ్డి మాట్లాడుతూప్రైవేట్ పాఠశాలల బలోపేతానికి ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాల సంఘం ఎంతగాన కృషి చేస్తున్నదని అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం ఎంతో బలంగా ఉండి సభ్యుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరంగా శ్రమిస్తున్నదని అన్నారు. తన వద్దకు వచ్చిన సమస్యల పరిష్కారానికి ఎంత చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానని తెలిపారు. యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉంటే సంఘం మరింత బలంగా ఉంటే , ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధి కి ఎంతో మేలుజరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా రాష్ట్ర నాయకత్వం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నదని కొనియాడారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మెట్ట జనార్ధన్ రావు మాట్లాడుత ఇప్పటివరకు అప్స యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. పాఠశాలలు మరింత అభివృద్ధి చెందడానికి కావలసిన సూచనలు అందించారు. ప్రైవేట్ పాఠశాలల సమస్యలను నిరంతరం రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్న తీరును వివరించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలల సంఘాల సమన్వయానికి, కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రత్యేక గవర్నమెంట్ బాడీని ఈ సమావేశంలో ఏర్పాటు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. గవర్నింగ్ బాడీ సభ్యులుగా జోహార్ ఖాన్, వాసు పట్నాయక్, కింగ్, పల్లంటి చిరంజీవి, పక్కి బాలకృష్ణ, కే రామారావు లను ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర జిల్లా నాయకులకు, గవర్నింగ్ బాడీ సభ్యులకు చాట్ల తులసీదాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అప్పలాచారి, ఉత్తరాంధ్ర అధ్యక్షులు గణపతి రావు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, ఇచ్ఛాపురం మండల ప్రతినిధులు బి కృష్ణమూర్తి రెడ్డి, వేణుగోపాలరావు, రవికుమార్, శ్రీరామమూర్తి, రమేష్, కన్నబాబు, చిన్న, ఆదినారాయణ, డి తిరుపతి, మాధవరావు, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.






## పంగవాని చెరువును
# గుర్రపు డెక్క నుంచి కాపాడాలి

- గుర్రపుడెక్కతో నిండిపోయిన చెరువు
- రైతులు, పశువులకు నీటి ఇబ్బందులు
- తక్షణమే తొలగించి చెరువును పునరుద్ధరించాలని డిమాండ్

**నరసన్నపేట, సెప్టెంబరు 16 (వార్త):** నరసన్నపేట మండలంలోని చిన్నకరగాం గ్రామంలో ఉన్న పంగవాని చెరువు గుర్రపుడెక్కతో పూర్తిగా నిండిపోవడంతో నీటి వినియోగానికి వీల్లేకుండా మారిందని సామాజికవేత్త, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ ఉద్యమ నాయకుడు మల్లేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా నీటి వనరు ఉన్నప్పటికీ రైతులు, పశుపోషకులు దానిని వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. చెరువులో గుర్రపుడెక్క విస్తరించడంతో నీటి ప్రవాహం, వినియోగం దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు. సాగు అవసరాలతో పాటు పశువుల తాగునీటి కోసం ఈ చెరువుపై ఆధారపడుతున్న రైతులు ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే చెరువు నీటి నాణ్యత, వినియోగ సామర్థ్యం మరింత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు పంగవాని చెరువును తక్షణమే పరిశీలించి, గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించే చర్యలు చేపట్టాలని మల్లేశ్వరరావు కోరారు. చెరువును శుభ్రపరిచి నీటి వినియోగానికి అనుకూలంగా పునరుద్ధరించడంతో పాటు భవిష్యత్తులో గుర్రపుడెక్క విస్తరించకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతులు, పశువులకు నీటి సమస్య లేకుండా అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16(వార్త):** ఇచ్ఛాపురంలోని విప్ క్యాంప్ కార్యాలయం వద్ద కార్యక్రమం ఇచ్ఛాపురం మండలం భూర్జపాడు పంచాయతీ లో చిన్నలక్ష్మీపురం లో యర్ర విమల నాగరాజు ల కుమారుడు యర్ర తన్విక్ అనే రెండేళ్ల బాబు కి బ్రెయిన్ ట్యూమర్స్ వల్ల బాధపడుతూ కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ లో ఆపరేషన్ కి చాలా రూపాయలు ఖర్చు అయింది. అబ్బాయి తన్విక్ కి వైద్యఖర్చులు కోసం ఆ గ్రామ పంచాయతీ పెద్దలు దున్న లోకేష్ మాజీ సర్పంచ్ దక్కత ఢిల్లీరావు పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు ద్వారా ఇచ్ఛాపురం శాసన సభ్యులు మన ఎపి ప్రభుత్వ విప్ బి అశోక్ కి విన్న వించిన పిదప ప్రభుత్వవిప్ బి అశోక్ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి నమోదు చేసి సి ఎం ఆర్ ఎఫ్ నిధులు 5లక్షలు మంజూరు చేయించారు.మన మంచి ప్రభుత్వం ఆ కుటుంబము నకు రాష్ట్ర ప్రభుత్వ విప్ బి అశోక్ క్యాంపు కార్యాలయం వద్ద శాసన సభ్యులు బి అశోక్ చేతులు మీదుగా అందరితో కలిసి వారు కుటుంబం నకు 5,00,000 లక్షలు చెక్కు అందజేశారు.ఈ కార్యక్రమ లో ఇచ్ఛాపురం మండలం పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, దున్న లోకేష్ మాజీ సర్పంచ్, దున్న కుర్మారావు, దున్న కామేష్,ఈయర్ర జోగారావు, బడే రామారావు, వైద్య ఖర్చు నిమిత్తము సీఎం రిలీఫ్ఫాండ్ ఇచ్చిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకి , విప్ బి అశోక్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

## ద్విచక్ర వాహనదారులు
# తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి




**ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 16(వార్త):** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు కలమట సాగర్ సూచించారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఎల్ఎన్ పేటలో తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు, యువకులు తదితరులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ హెల్మెట్ వాహనదారుడి ప్రాణాలను కాపాడటంతో పాటు ఆయనపై ఆధారపడిన కుటుంబాన్ని కూడా రక్షిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసు, స్వచ్ఛంద సంస్థల సూచనలను పాటిస్తూ హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన, చైతన్యం కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు శివ్వాల కిషోర్ బాబు, కుంచాల అప్పలనాయుడు, గుండపు రాము, గొలివి వాసుదేవరావు, శ్రీహరి, ధర్మాన ముసలి నాయుడు, దార పెంటయ్య, గేదెల ధర్మారావు, సిమ్మ కిషోర్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో ..
# గెలుపే లక్ష్యం కావాలి



**మందస, సెప్టెంబరు 16(వార్త):** తెలుగుదేశం పార్టీ మందస మండల శాఖ సమావేశం మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగింది. సమావేశం అత్యంత ఉత్సాహంగా జరిగింది. మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా గెలుపొంది, ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఘన విజయాన్ని బహుమతిగా అందించాలని పిలుపునిచ్చారు. అలాగే పార్టీ కార్యక్రమాలన్నీ 'మై టిడిపి' యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ప్రతీ పనితీరును అధిష్టానం గమనిస్తోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సాలీన మాధవరావు, దాసరి తాతారావు, బమ్మిడి కర్రయ్య తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హిందీ.. జాతీయ సమైక్యతకు వారధి

- నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ పక్షోత్సవాల ప్రత్యేక కార్యక్రమం

**పలాస, సెప్టెంబరు 16 (వార్త):** భారత జాతీయోద్యమంలో ప్రజలను జాగృతం చేసి, దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడంలో హిందీ భాష కీలక పాత్ర పోషించిందని పలువురు వక్తలు తెలిపారు. జాతీయ హిందీ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు 'అ' అక్షరం ఆకారంలో మానవహారంగా నిలిచి ఆకట్టుకున్నారు. హిందీ భాష ప్రాధాన్యాన్ని చాటిచెప్పేలా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉపయోగపడుతోందన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించేటప్పుడు హిందీ పరిజ్ఞానం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ హిందీని చదవడం, మాట్లాడడం నేర్చుకోవాలని, తద్వారా జాతీయ సమైక్యతకు దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయులు వై. కాళిదాసు, ఎన్. గౌరునాయుడులను ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు తలగాన హేమరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# మందసను కరువు మండలంగా ప్రకటించాలి

**- ఎంపీటీసీ సభ్యుల పెండింగ్ గౌరవ వేతనాలు వెంటనే చెల్లించాలి**

**- మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో తీర్మానం**



**మందస, సెప్టెంబరు 16(వార్త):** వర్షాలు లేక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని, రైతులు పెట్టిన పెట్టుబడి కూడా ఈ ఏడాది వచ్చే పరిస్థితులు లేవని, ఈ నేపథ్యంలో మందస మండలం ను కరువు మండలం గా ప్రకటించాలని, అదేవిధంగా ఎంపీటీసీల పెండింగ్ గౌరవ వేతనాలు చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని విన్నవిస్తూ మందస మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది.

ఎంపీపీ డొక్కరి దానయ్య తీర్మానం ప్రవేశపెట్టగా, సభ్యులందరూ చేతులెత్తి తమ ఆమోదం తెలిపారు. మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ దానయ్య మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో మందస మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేయడం జరిగిందన్నారు. అనంతరం వైస్ ఎంపీపీ సీర ప్రసాద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి మండల అధికారులు ఎవరూ సహకరించడం లేదని, మండల అధికారులు ఎవరూ పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదని, మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాలలో లేవనెత్తిన ఏ సమస్య పరిష్కారం కాలేదని, అభివృద్ధి కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు కూడా సక్రమంగా చెల్లించని పరిస్థితి నెలకొందని మండిపడ్డారు.

అనంతరం ఎంపీటీసీల పదవీకాలం ముగియనుండడంతో ఎంపీపీ దానయ్య ఆధ్వర్యంలో బుధవారం ఎంపీటీసీలను, జడ్పిటిసిను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ కొర్నాని ఆదినారాయణ, ఎంపీడీఓ వై.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## హిందీ దివస్ వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16(వార్త):** హిందీ పక్షోత్సవాలు లో భాగంగా హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. హెచ్ ఎం శశిభూషణ్ గౌడో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో ఐ.వెంకటరమణ, వి హెచ్ నేతాజీ, రాజేష్, కరుణ, నరేంద్ర కుమార్, రఫీ,మోహన్,ధర్మారావు, కుసుమ కుమారి, షాజన్, నాగేశ్వరావు, నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణనాథుని ఉత్సవాలు




**సోంపేట, సెప్టెంబరు 16(వార్త):** గణనాథుని ఉత్సవాలు అనేక చోట్ల ఘనంగా కొనసాగుతున్నాయి. సోంపేట పట్టణంతోపాటు పలు గ్రామాల్లో వినాయక పూజ కార్యక్రమాలు ఐదు రోజులు, ఏడు రోజులు, అలాగే తొమ్మిది రోజులపాటు కూడా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. బారువ గ్రామం అంకం వీధిలో కొలువుదీరిన వినాయకునికి భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. మహిళలు విశేష దీపారాధన కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహిస్తూ చేపడుతున్న కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



## స్థానిక ఎన్నికలపై
# అఖిలపక్ష సమావేశం

**-17 ఎంపీటీసీ స్థానాలకు 67 పోలింగ్ కేంద్రాలు**

**- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంపై అధికారుల సూచనలు**

**- ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు**

**జలుమూరు, సెప్టెంబరు 16 (వార్త):** జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి బుధవారం పలు రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. మండలంలో మొత్తం 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, 51,602 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. గతంలో 66 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 67కు పెరిగినట్లు తెలిపారు. రెండు గ్రామాలకు ఒక ఎంపీటీసీ ప్రాతిపదికన గత ఎన్నికల్లో ఉన్న విధానంతో పోల్చితే ప్రస్తుత పోలింగ్ కేంద్రాల వివరాలు, ఏర్పాట్లపై సమావేశంలో పార్టీల ప్రతినిధులకు అధికారులు వివరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీవో చిన్నమ్మడు, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఆర్వో జన్ని రామారావు, ఎస్సై అశోక్‌బాబు సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు, వివాదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు స్వేచ్ఛగా వినియోగించుకునేలా అనుకూల వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మద్యం ప్రభావం తగ్గితే తగాదాలు, వివాదాలు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసుకునే స్వేచ్ఛ ఉండేలా అన్ని వర్గాలు సహకరించాలని సూచించారు. జలుమూరు మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంట కర్ణవీడు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో అధికారులు అన్ని రాజకీయ పార్టీలను సమానంగా చూడాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను ప్రతి పార్టీకి ఒకే విధంగా అమలు చేయాలని సూచించారు.

సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుంట కర్ణవీడు, బీజేపీ మండల అధ్యక్షుడు తులసీరావు మాస్టర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కనుసు సీతయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేందర్‌నాయుడు, జనసేన మండల అధ్యక్షుడితో పాటు సీపీఐ, సీపీఎం మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



**పాతపట్నం, సెప్టెంబరు 16 (వార్త):** సూర్యనారాయణపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 ఎ గోవిందరావు బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యా బోధన, క్రమశిక్షణ చాలా బాగున్నాయని, ఉపాధ్యాయులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల భవనం బాగున్నప్పటికీ, మరుగుదొడ్లు, వంటగది భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని ప్రధానోపాధ్యాయురాలు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదకరంగా మారడంతో ప్రస్తుతం వాటిని ఉపయోగించడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఈఓ గోవిందరావు తక్కువ సమయంలోనే ఇవి దెబ్బతినడం వల్ల సంబంధిత కాంట్రాక్టర్ నుండి సొమ్ము రికవరీ చేయడానికి లేదా భవనాలను పునర్నిర్మించడానికి ఇంజనీరింగ్ అధికారులకు, ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్శన సందర్భంగా పాఠశాలకు చెందిన ఆర్ సురేష్ అనే దివ్యాంగ (మూగ) విద్యార్థిని ఎంఈఓ అభినందిస్తూ, అతనికి ఐదు వందల రూపాయలు నగదును ప్రోత్సాహకంగా అందజేశారు.

## గణేష్ మండపాల వ్యవస్థాపకుడు తిలక్

**మెళియాపుట్టి, సెప్టెంబరు 16 (వార్త):** గణేష్ మండపాల ద్వారా ప్రజలను ఐక్యం చేసిన మహానీయుడు బాలగంగాధర్ తిలక్ అని పాతపట్నం నియోజకవర్గ బిజెపి పార్టీ నాయకులు డాక్టర్ శరత్ కుమార్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో ప్రజలు ఒకచోట కలవకుండా బ్రిటిష్ ప్రభుత్వం అనేక ఆంక్షలు విధించేదని ఆయన తెలియజేస్తూనే ఆ సమయంలో ప్రజలందరినీ ఒకే వేదికపైకి తెచ్చి, స్వాతంత్ర్య పోరాటంలో నాయకులను, ప్రజలను ఐక్యం చేసేందుకు బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాల వేదికలను ఉపయోగించుకున్నారని తెలియపరిచారు. అప్పటి నుంచే మనం గణేష్ మండపాలు ఏర్పాటు నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడం ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా మెళియాపుట్టి మండలం కేంద్రంతో పాటు హిరాపురం, తదితర గ్రామాలలో ఏర్పాటుచేసిన గణేష్ శిబిరాల వద్దకు బుధవారం నాడు సందర్శించి గణేష్ మండపాలకు బాలగంగాధర్ తిలక్ చిత్రపటాలను బహుకరించి, ప్రజలకు ఆనాటి చరిత్రను గుర్తుచేశారు. అదేవిధంగా మన హిందూ పండగలన్నీ కూడా ప్రకృతితో అనుసంధానమై ఉన్నాయని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే మండపాల్లో ప్రతిష్ఠించాలని, వినాయక నిమజ్జన సమయంలో డీజేలకు దూరంగా ఉంటూ తప్పెటగుళ్లు, కోలాటాలు, భజన బృందాలతో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్శన కార్యక్రమంలో ఢిల్లీ, నల్లి సురేష్, బోను గన్నయ్య, బోను రమేష్, అనపాన తిరుపతి, కాళ్ళ చిరంజీవి, లక్ష్మిపురం ఉమశంకర్, రాజు, బేరి ధర్మారావు, లక్ష్మిపురం కిరణ్, తదితర గ్రామ పెద్దలతో పాటు యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఆకట్టుకున్న 10 అడుగుల వినాయకుడు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 16 (వార్త):** ఇచ్ఛాపురంలోని డబ్బూరివీధి జంక్షన్, సిందిరి వీధి, కొత్త వీధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 అడుగుల వెంకటేశ్వర స్వామి అవతారం లో ఉన్న వినాయకుడు ఆకట్టుకుంటుంది. డీఎస్‌కే యూత్ కమిటీ పర్యవేక్షణలో ఏడు ద్వారబంధాలు ఏర్పాటు తో ఏడుకొండల వెంకన్న తరహాలో ఆకట్టుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో సందర్భిస్తున్నారు.

# పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

**మందస, సెప్టెంబరు 16(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేసి, బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మందస మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పట్టులోగాం, బంసుగాం, కిల్లోయి, మహదేవపురం, పిడిమందస, మందస, సిరిపురం తదితర పాఠశాలలను నాయకులు సందర్శించారు. ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదును చేపట్టారు.

ఇటీవల యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన సీనియర్ నాయకుడు గుంట కోదండరావును పట్టులోగాం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమ్మినేని శారద, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గుంట కోదండరావు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రెండు డీఏలకు సంబంధించిన బకాయిలను 2028 ఆగస్టు వరకు వాయిదా వేయడం సమంజసం కాదని అన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరులో నిర్వహించిన రణభేరి 2.0 పోరాటం అనంతరం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని చేపట్టిన ఐక్య ఉద్యమాల ఫలితంగానే ప్రభుత్వం డీఏల విడుదలకు ముందుకు వచ్చిందని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఐక్య ఉద్యమాల ద్వారా మెరుగైన పీఆర్సీ, ఐఆర్ సాధించేందుకు పోరాటాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ చేపట్టే భవిష్యత్ ఉద్యమాల్లో ఉపాధ్యాయులందరూ ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జయరాంమాలి, మండల పూర్వాధ్యక్షుడు పిన్నింటి కొండలరావు, మండల సీపీఎస్ కన్వీనర్ సారి ప్రేమ్ కుమార్, జిల్లా కౌన్సిలర్లు తరణి సోమేశ్వరరావు, కుత్తం సుధాకర్, సత్యానంద బెహరా తదితరులు పాల్గొన్నారు.




## మహిళా జర్నలిస్టు మేఘనకు కోత పరామర్శ

**పలాస, సెప్టెంబరు 16 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, జనసేన నాయకుడు కోత పూర్ణచంద్రరావు మహిళా జర్నలిస్టు మేఘనను పరామర్శించారు. అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె ఇంటికి బుధవారం వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేఘన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పూర్ణచంద్రరావు ఆకాంక్షించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల కృషి అభినందనీయమని అన్నారు. మేఘన త్వరగా కోలుకుని తన పాత్రికేయ సేవలను కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆ రహదారికి మోక్షమెప్పుడో!

-దారుణంగా తయారైన డాక్టర్ రాజ్‌కుమార్ ఆసుపత్రికి ఎదురు రోడ్డు

-30 అడుగుల దారి.. ఆక్రమణలతో కుచించుకుపోతున్న వైనం

-కాలువలు లేక రోడ్డుపైనే మురుగునీరు

-రాకపోకలకు అవస్థలు

-అభివృద్ధికి మున్సిపల్ తీర్మానం ఉన్నా.. కార్యరూపం దాల్చని దుస్థితి



**పలాస, సెప్టెంబరు 16 (వార్త):** పలాస పట్టణ నడిబొడ్డున ఉన్న ఎదురుగా ఉన్న డాక్టర్ రాజ్‌కుమార్ ఆసుపత్రి రహదారికి అభివృద్ధి ఎప్పుడు మోక్షం దక్కుతుందన్న ప్రశ్న స్థానికులను వేధిస్తోంది. పట్టణ విస్తరణతో ఈ మార్గంలో రాకపోకలు రోజురోజుకూ పెరుగుతున్నా.. అందుకు అనుగుణంగా మౌలిక వసతులు మాత్రం మెరుగుపడటం లేదని స్థానికులు మండిపడుతున్నారు . కళాశాల, పలు పాఠశాలతో పాటు పలు వాణిజ్య సముదాయాలు ఉండటంతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. అయినప్పటికీ రహదారి విస్తరణ, డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలు పట్టించుకునే నాథుడు కరవయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమణలతో కుచించుకుపోతున్న దారిని, సుమారు 30 అడుగుల వెడల్పుతో ఉన్న రహదారి పలు ప్రాంతాల్లో ఆక్రమణలకు గురవుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దుకాణాలు, నిర్మాణాలు, ఇతర ఆక్రమణల కారణంగా రహదారి అందుబాటులో లేకుండా పోయిందని స్థానికులు అనుకుంటున్నారు. దీంతో ఎదురెదురుగా వాహనాలు వెళ్లే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు రహదారి హద్దులను సర్వే చేసి, ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### తీర్మానం ఉంది.. పనులు ఎక్కడ?

డాక్టర్ రాజ్‌కుమార్ ఎదురుగా ఉన్న రహదారి అభివృద్ధికి గతంలో మున్సిపాలిటీలో తీర్మానం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. రహదారి నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు వచ్చినప్పటికీ.. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని అంటున్నారు. మున్సిపల్ తీర్మానం జరిగి కూడా కార్యరూపం దాల్చకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. తీర్మానాలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### కాలువలు లేవు.. రోడ్డుపైనే మురుగునీరు

ఈ మార్గంలో ప్రధాన సమస్య డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడమే. మురుగునీరు వెళ్లేందుకు సరైన కాలువలు లేకపోవడంతో రహదారిపైనే ప్రవహిస్తోంది. వర్షాలు కురిసినప్పుడు పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### అభివృద్ధికి అడ్డంకులెన్నో..

ఈ రహదారికి కేవలం తారురోడ్డు వేయడం వల్ల సమస్య పూర్తిగా పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు. తొలుత రహదారి హద్దులను స్పష్టంగా గుర్తించి ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు. అనంతరం ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు నిర్మించి, అవసరమైన మేరకు రహదారిని అభివృద్ధి చేయాలని సూచిస్తున్నారు. రహదారి, డ్రెయినేజీ, పారిశుధ్య వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేసినప్పుడే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు అంటున్నారు.

### ఇప్పటికైనా మేల్కొనేనా?

పలాస పట్టణ అభివృద్ధిపై అధికారులు దృష్టి సారిస్తున్న నేపథ్యంలో డాక్టర్ రాజ్‌కుమార్ రహదారి సమస్యపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో చేసిన మున్సిపల్ తీర్మానాన్ని పరిశీలించి.. రహదారి హద్దులను నిర్ధారించడం, ఆక్రమణలను తొలగించడం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం, పక్కా రహదారి నిర్మాణం వంటి చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ఎన్నాళ్లుగానో అభివృద్ధికి నోచుకోని ఈ మార్గానికి ఎప్పుడు మోక్షం లభిస్తుందో.. మున్సిపల్ తీర్మానం ఎప్పుడు పనుల రూపం దాల్చుతుందోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

## అనారోగ్య బాధితునికి ఆర్థికసాయం



**సోంపేట, సెప్టెంబరు 16(వార్త):** మాకన్నపురం గ్రామానికి చెందిన అనారోగ్య బాధితుడు మద్దిల మోహన రావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ చేతులమీదుగా అందజేశారు. చెక్కు రూపంలో 86,635 రూపాయలను బుధవారం అందించారు. మోహన్ రావు గుండె సంబంధిత సమస్యతో వివిధ ఆసుపత్రుల్లో చేరి బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. లక్షల రూపాయల్లో ఆసుపత్రులకు ఖర్చులు పెట్టారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మోహన్ రావుకు వైద్య ఖర్చులు ఎనలేని భారంగా మారాయి. ఈ పరిస్థితుల్లో కొంతమేరకు ప్రభుత్వం నుంచి నాయకుల కృషితో అందడంతో సంతోషం వ్యక్తం చేశారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో కంచిలి ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి మద్దిల నాగేశ్వరరావు, మల్ల కోదండరావు, దట్టి కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్యవరంలో ఓజోన్ దినోత్సవం



**నరసన్నపేట, సెప్టెంబరు 16 (వార్త):** సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల్లో ఓజోన్ పొర ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు పాఠశాల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వకుళ రత్నమాల మాట్లాడుతూ భూమిపై జీవరాశుల మనుగడకు ఓజోన్ పొర ఎంతో కీలకమని వివరించారు. సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి భూమిని రక్షించడంలో ఓజోన్ పొర ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యలను తగ్గించి, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థుల్లో పర్యావరణంపై ఆసక్తిని పెంచేలా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన '3' ఆకృతి విద్యార్థులతో పాటు స్థానికులను ఆకట్టుకుంది. ఓజోన్ పరిరక్షణ సందేశాన్ని వినూత్నంగా తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఈ ఆకృతి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఓజోన్ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

## వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 16 (వార్త):** ఖరీఫ్ సీజన్‌లో చేపడుతున్న వరి సాగులో రైతులు తప్పనిసరిగా పంట యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ అధికారి సూర్యకుమారి సూచించారు. నరసన్నపేట మండలం కంబకాయ రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పలు సూచనలు చేశారు. వరి పంట సాగులో ప్రారంభ దశ నుంచే పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించాలని ఆమె తెలిపారు. పంటలో తెగుళ్లు, పురుగు ఉధృతి కనిపించే అవకాశాలను ముందుగానే గుర్తించి, వాటి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమస్య తీవ్రతను బట్టి వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పంటకు అవసరమైన మేరకే ఎరువులను వినియోగించాలని, మోతాదుకు మించి ఎరువులు వేయడం వల్ల సాగు ఖర్చులు పెరగడంతో పాటు పంటపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సమతుల్య పద్ధతిలో వాడాలని రైతులకు సూచించారు. ఖరీఫ్ వరి సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులను నియంత్రించుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారి సూర్యకుమారి వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించి పంటను సమర్థవంతంగా సాగు చేయాలని కోరారు.

## నిజమైన మత్స్యకారులకే 50 ఏళ్ల పింఛన్ ఇప్పించండి

**సోంపేట, సెప్టెంబరు 16 (వార్త):** సముద్రంలోనూ, చెరువులు, గెడ్డల్లోనూ చేపల వేట వృత్తి సాగిస్తూ దానిపైనే ఆధారపడి బతుకుతున్న నిజమైన మత్స్యకారులకు 50 ఏళ్లకు సంబంధించిన పింఛన్లు మంజూరు చేయాలని మత్స్యకార ఐక్యవేదిక డిమాండ్ చేసింది. మత్స్యకారులమంటూ ఇతరులు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు ఈ మండలం ఉప్పలం గ్రామంలో బడే తమ్మారావు తదితర నేతలు మాట్లాడుతూ రాజకీయ స్వార్థంతో ఓట్ల కోసం కొంతమంది అధికార పార్టీ నాయకులే ఇటువంటి ప్రయత్నాలు చేయడం సమంజసం కాదని అన్నారు. మత్స్యకార కులాల్లోని రిజర్వేషన్ పొందుతూ ఎటువంటి కులవృత్తి చేపట్టని కులాలకు పింఛన్ల వంటి సదుపాయాలు కల్పించి నిజమైన మత్స్యకారుల పొట్ట కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బడే సూర్యనారాయణ, గంట సన్యాసి, ఎస్. వెంకట్రావు, జి.జోగారావు తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో సామూహిక లక్ష గరికపూస అర్చన



**పలాస, సెప్టెంబరు 16 (వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతవర్ష జన్మదిన వేడుకల్లో భాగంగా పలాస శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వినాయకునికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భావించే పంచమి తిథిని పురస్కరించుకుని బుధవారం సామూహిక లక్ష గరికపూస అర్చనను ఘనంగా నిర్వహించారు. వేదపురోహితులు ధర్మపురి కాశ్యప్ శర్మ ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చారణల మధ్య అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, దంపతులు, పురుషులు, యువతీ యువకులు కలిపి సుమారు 160 మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొని గరికలతో విఘ్నేశ్వరుడిని సామూహికంగా ఆరాధించారు. భక్తులు గణనాథునికి గరికపూసలను సమర్పిస్తూ ఆధ్యాత్మిక భావనతో పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ ఇప్పిలి తిరుమలరావు మాట్లాడుతూ వినాయకునికి గరిక అత్యంత ప్రీతిపాత్రమైనదని తెలిపారు. భగవంతుడికి సమర్పించే వస్తువు విలువ కంటే భక్తుడు సమర్పించే భక్తిభావం, ప్రేమ, విశ్వాసాలకే ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ భావనను ప్రతిబింబించేలా సామూహిక లక్ష గరికపూస అర్చన నిర్వహించినట్లు చెప్పారు.

సామూహికంగా భక్తులు ఒకే ఆధ్యాత్మిక సంకల్పంతో అర్చనలో పాల్గొనడం ద్వారా భక్తి, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. శ్రీ సత్యసాయి బాబా శతవర్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సేవా కార్యక్రమాలతో పాటు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, పెంట కౌంతేయుడు, దోకి జగదీష్, మద్ది కామేశ్వరరావు, తాలసు సూర్యప్రకాశ్, పొట్నూరు కొండలరావు, జామి శ్రీనివాస్, మల్లా శరత్, తాలసు శ్రీనివాస్, మల్లా రామేశ్వరరావు పాల్గొన్నారు.

## నీటి పొదుపుతో సాగు చేపట్టాలి

- వరి సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వర్షాభావ పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగించాలి
- యూరియా వినియోగాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి సూచన

**సారవకోట, సెప్టెంబరు 16 (వార్త):** కిన్నెరవాడలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి వినియోగం, ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారి వెంకటరావు అవగాహన కల్పించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీటిని వృథా చేయకుండా అవసరానికి అనుగుణంగా వినియోగించాలని ఆయన సూచించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు రైతులకు సాగు భారం తగ్గుతుందని తెలిపారు.

వరి సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పంట ఆరోగ్యంగా పెరగడంతో పాటు దిగుబడిని మెరుగుపరచుకోవచ్చని పేర్కొన్నారు. పంట అవసరాలకు అనుగుణంగా ఎరువులను వినియోగించాలని, ముఖ్యంగా యూరియాను అధికంగా ఉపయోగించకుండా నియంత్రించాలని రైతులకు సూచించారు. రైతులు వాతావరణ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపికలో తగిన నిర్ణయాలు తీసుకోవాలని వ్యవసాయాధికారి సూచించారు. కార్యక్రమంలో రైతులకు సాగులో నీటి పొదుపు, సమతుల్య ఎరువుల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.



## ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

- మానవాళి మనుగడకు ఓజోన్ పొర రక్షణ ఎంతో కీలకం
- అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ కల్పించే ఓజోన్ పొర
- పరిరక్షణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన ప్రిన్సిపాల్



**నరసన్నపేట, సెప్టెంబరు 16 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొర ప్రాధాన్యం, దాని పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. లత మాట్లాడుతూ మానవాళి ఆరోగ్యకరమైన జీవనానికి ఓజోన్ పొరను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాలను ఓజోన్ పొర అడ్డుకుని భూమిపై జీవరాశులను రక్షిస్తుందని తెలిపారు. ఓజోన్ పొర క్షీణిస్తే అతినీలలోహిత కిరణాల ప్రభావం పెరిగి మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణంపై కూడా ప్రతికూల ప్రభావాలు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంచుకుని, సమాజంలోనూ చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఓజోన్ పొరను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళితులకు మున్సిపల్ చైర్మన్ అవకాశం కల్పించాలి

-ఎస్సీ రిజర్వేషన్‌తో రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలి

-జనాభా ప్రాతిపదికన వార్డుల పునర్విభజన చేపట్టాలి

- ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాయలపల్లి లక్ష్మణరావు

**పలాస, సెప్టెంబరు 16 వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో దళిత వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈసారి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వాయలపల్లి లక్ష్మణరావు (ఆర్ట్ లక్ష్మణ్) విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ ఏర్పడి నాలుగు పర్యాయాలు పూర్తయినా ఎస్సీ వర్గాలకు ఆశించిన స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం దక్కలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పీఠాన్ని దళితులకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి వివిధ రిజర్వేషన్ల ద్వారా ఇతర సామాజిక వర్గాలకు అవకాశం లభించినప్పటికీ, ఎస్సీ వర్గాలకు చైర్మన్ పదవిలో అవకాశం దక్కలేదని లక్ష్మణరావు తెలిపారు. స్థానిక సంస్థల్లో సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం లక్ష్యంగా రిజర్వేషన్లు అమలు చేస్తున్న నేపథ్యంలో పలాస మున్సిపాలిటీలోనూ ఎస్సీ వర్గాలకు తగిన అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.



### జనాభా ప్రాతిపదికన వార్డులు కేటాయించాలి

మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రస్తుతం మూడు వార్డులు మాత్రమే కేటాయించారని ఆయన తెలిపారు. ఆయా వర్గాల జనాభా, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈసారి కనీసం ఐదు వార్డులు కేటాయించేలా వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరారు. ఓటర్ల సంఖ్య, జనాభా నిష్పత్తి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా వార్డుల విభజన చేయాలని విజ్ఞప్తి చేశారు.

### రాజకీయ అవకాశాలు కల్పించాలి

వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా దళితులకు స్థానిక రాజకీయాల్లో ముందుకు వచ్చే అవకాశాలు కల్పించినప్పుడే ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం మరింత విస్తృతమవుతుందని లక్ష్మణరావు తెలిపారు. కేవలం వార్డు స్థాయి ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా, మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవుల్లోనూ దళితులకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని ఎస్సీ వర్గానికి రిజర్వు చేయడంతో పాటు, జనాభా ప్రాతిపదికన తగిన సంఖ్యలో వార్డులు కేటాయించాలని ఆయన కోరారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ ప్రాతినిధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు, రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని పరిశీలించాలని వాయలపల్లి లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546